## క్లుప్తంగా

### కార్తికేయునికి వెండి హారం సమర్పణ

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి చోడవరం గ్రామస్తులు చైతన్య కుటుంబ సభ్యులు 200 గ్రాములతో తయారు చేసిన వెండి హారం శనివారం సమర్పించుకున్నారు. ఉదయం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు ఈ వెండి హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత చైతన్య కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సహాయం

కోడూరు: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితురాలు బెల్లకొండ రత్నకుమారికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్ను రంగారావు రూ.5వేల నగదును అందించి దాతృత్వం చాటారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

### సంగమూడి ఉన్నత పాఠశాలలో ఇంటర్ తరగతులు

కృత్తివెన్ను: మండల పరిధిలోని సంగమూడి ఉన్నత పాఠశాల(ప్లస్1) లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నట్లు ఎంఈవో ఎస్‌కేడీవీ ప్రసాదరావు తెలిపారు. దీనికి సంబంధించి శనివారం పాఠశాల వద్ద తరగతి గదులను ఆయన ప్రారంభించారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని ఎంపీసీ నుంచి 40 సీట్లు, సీఈసీ నుంచి 20 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం పద్మజారాణి, చైర్మన్ జీవనజ్యోతి, సీఆర్‌సీ రామాంజనేయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### శరవేగంగా డ్రైనేజీ తవ్వకం పనులు

చల్లపల్లి: గ్రామంలో కొన్నేళ్లుగా సమస్యాత్మకంగా ఉన్న డ్రైనేజీ తవ్వకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. స్థానిక పెద్దకళ్లేపల్లి రోడ్డులో ఆక్వా ఫీడ్ మిల్లులు, హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ, ప్రైవేట్ కళాశాలల వద్ద నుంచి గృహ సముదాయాల మీదుగా బండ్రేవుకోడు మైనర్ డ్రైనేజీలోకి కలిపేందుకు పంచాయతీ నిధులు అంచనా వ్యయం రూ.2.30 లక్షలతో తవ్వకం పనులు చేపట్టారు. అంతర్గత రహదారుల వద్ద, భవనాల వద్ద పూడిపోయిన తూము కల్వర్టులను పూర్తిగా తొలగించి నూతన తూములు ఏర్పాటు చేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ఆధ్వర్యంలో పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నారు.

### వడదెబ్బతో వృద్ధుడి మృతి




కోడూరు: వడదెబ్బ కారణంగా ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన కోడూరులో జరిగింది. మండలంలోని స్వతంత్రపురం గ్రామానికి చెందిన కూనపరెడ్డి వెంకటేశ్వరరావు (85) శుక్రవారం వీచిన వడగాడ్పులకు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వడదెబ్బ తగలడంతో శుక్రవారం రాత్రి వెంకటేశ్వరరావు చనిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

### వైఎస్సార్‌సీపీ విజయం కోరుతూ నాగపట్నంలో ప్రార్థనలు

ఘంటసాల: వచ్చే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కావాలని కోరుతూ తమిళనాడు రాష్ట్రం నాగపట్నంలోని వేలంకిణి మాత దేవాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి కొడాలి భక్తపాల్ కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబు, బందరు పార్లమెంట్ సభ్యుడిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు కూడా ఘన విజయం సాధించాలని కోరుతూ కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశామని భక్తపాల్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



గూడూరు: మండలంలోని మల్లవోలులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన పిచ్చుక బాలకోట సుబ్రహ్మణ్యం (39) శనివారం మృతి చెందాడు. పోలవరం గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు సుబ్రహ్మణ్యం గురువారం వ్యక్తిగత పనుల నిమిత్తం తన ద్విచక్రవాహనంపై మల్లవోలు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో అడ్డువచ్చిన కుక్కను తప్పించబోయిన క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోయాడు. ప్రమాదంలో తలకు, నవరగంతంకు బలమైన గాయాలవడంతో స్థానికులు ఆటోలో బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం ఉదయం ప్రాణాలు విడిచాడు. భార్య సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# అంజనీపుత్రునికి భక్త జన హారతి



పెడన : పెడనలో హిందూ భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర



మోపిదేవి : పెదప్రోలులో స్వామివారి దివ్యకల్యాణంలో పాల్గొన్న దంపతులు



కృత్తివెన్ను: గాంధీనగరంలో వెండి హారాన్ని స్వామివారికి అలంకరిస్తున్న రత్నారావు కుటుంబ సభ్యులు

పెడన: హనుమాన్ జయంతి సందర్భంగా పలు ప్రాంతాల్లోని శ్రీరాముని మందిరాలలోను, ఆంజనేయస్వామి దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెడన బస్టాండు సమీపంలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. లక్ష తమలపాకుల అర్చన, గారెలు, అరటిపళ్లతో అర్చనలు చేయించడం విశేషం. గౌడ సంఘం పెడన అధ్యక్షుడు పటమట బలరామ్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు. భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. భక్తులకు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

- రామలక్ష్మీ వీవర్స్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. హిందూ భక్తబృందం ఆధ్వర్యంలో భక్తులు పెద్ద ఎత్తున హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్నారు.
- పెడనలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలోని అంజనేయస్వామి ఉపాలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జయంతి వేడుకల్లో వాసవి మహిళా మండలి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- మండల పరిధిలోని చేవేంద్రపాలెం, ఉప్పలక లువగుంట గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన తమలపాకులతో అర్చనలు, అభిషేకాలు చేశారు.

**చల్లపల్లిలో...**

చల్లపల్లి: హనుమాన్ జయంతి వేడుకలు శనివారం చల్లపల్లి మండలంలో గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటరులోని ప్రముఖ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో హనుమజ్జయంతి పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు ఘంటసాల శతానంద శాస్త్రి స్వామివారికి విశేష అలంకరణతో



గూడూరు మండలం కంచాకోడూరులో...



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో...

పూజలు చేశారు. కమిటీ పెద్దలు, భక్తులు స్వామివారికి గారెల మాల, వడ మాల, నిమ్మకాయల మాలలు సమర్పించారు. రామానగరం, లక్ష్మీపురం, పాతమాజేరు, పచ్చార్లంక, కొత్తమాజేరు, వక్కలగడ్డ, పురిటిగడ్డ, నడకుదురు, వెలువోలు, ఆముదార్లంక, యార్లగడ్డ గ్రామాల్లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయాల్లో కమిటీల ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**భావదేవరపల్లిలో శ్రీసువర్చలాంజనేయ కల్యాణం**

నాగాయలంక: మండలంలో వాడవాడలా హనుమత్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. భావదేవరపల్లి గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీసువర్చల శ్రీఅభయాంజనేయస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు ముదునూరి అచ్యుత శర్మ బ్రహ్మత్వంలో నిర్వహించిన కల్యాణంలో పీటలపై స్థలదాత శివాజీ కుటుంబీకులు మాదివాడ శ్రీనివాసరావు, మాధవి దంపతులు పీటలపై కూర్చున్నారు. తొలుత ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్త సమాజం సభ్యులతో హనుమాన్ చాలీసా పారాయణం, ఆకుపూజ, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. అనంతరం ఆలయ నిర్మాణకర్త మలిశెట్టి సాంబశివరావు(నామాలు), బాలాంజనేయులు ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సౌజన్యంతో 2500 మందికి అన్నసంతర్పణ జరిపారు. వక్కపట్లవారిపాలెం గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్, రాణి దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామ సర్పంచ్ అంబటి శ్యామ్ ప్రసాద్, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మత్రిపాలెం, రేమాలవారిపాలెం గ్రామాల్లో భక్త సమాజాలు నేతృత్వంలో హనుమాన్ చాలీసా సామూహిక పారాయణం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. నంగేగడ్డ, కమ్మనమోలు తదితర పలు తీర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు కోలాహలంగా జరిపారు.

**గూడూరులో...**

గూడూరు: హనుమత్ జయంతిని గూడూరు మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. ఆంజనేయ స్వామి ఆలయాలలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గూడూరులోని మారుతీ నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పెద్ద ఎత్తున భక్తులు పూజలో



నాగాయలంక మండలం రేమాలవారిపాలెంలో హనుమాన్ చాలీసా పారాయణం

పాల్గొన్నారు. కప్పలదొడ్డి, కంచాకోడూరు గ్రామాల్లో హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

**ఆంజనేయుడికి వెండి తొడుగుల బహూకరణ**

గూడూరు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ముక్కొల్లులోని శ్రీ రామాలయంలో ఉన్న ఆంజనేయ స్వామి వారికి భక్తులు తులసీరావు, రంగామణి దంపతులు రెండున్నర అడుగుల వెండి తొడుగును సమకూర్చారు. ఈ సందర్భంగా ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

**ఆంజనేయస్వామికి వెండి హారం బహూకరణ**

కృత్తివెన్ను: హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మండల పరిధిలోని గాంధీనగరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామివారికి గ్రామానికి చెందిన పిన్నెంటి వీరవెంకట రత్నారావు (జీవుచంటి), వారి కుమారులు ప్రత్యేకంగా తయారు చేయించిన హారాన్ని స్వామివారికి అలంకరించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామివారి దేవాలయాల్లో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. నీలిపూడి, సంగమూడి, ఒంటిప్ల తదితర గ్రామాలలోనూ ఉత్సవాలు జరుగుతున్నాయి.

**పెదప్రోలులో...**

పెదప్రోలు(మోపిదేవి): మండలంలో పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. పెదప్రోలు ఆంజనేయ స్వామివారి ఆలయంలో ఉదయం ఆలయ ప్రధానార్చకులు పెళ్లూరి వెంకటేశ్వరరావు బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారి దివ్య కల్యాణోత్సవం వైభవంగా వేదమంత్రాల నడుమ నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం 5 గంటలకు ప్రత్యేక వాహనంలో స్వామివారి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు వివరించారు.

## శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం



కోడూరులో ప్రత్యేక అలంకారంలో ఆంజనేయుడు



ఘంటసాల శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కోడూరు: కోడూరు చుట్టుపక్కల గ్రామాల్లో శనివారం ఆంజనేయస్వామివారి జయంతిని కనులపండువగా జరిపారు. స్థానిక వంతెన సెంటర్‌లోని అభయ ఆంజనేయస్వామివారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సువర్చలా సమేత ఆంజనేయస్వామివారి కల్యాణాన్ని నయనమనోహరంగా జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. లింగారెడ్డిపాలెం, నక్కవానిదారి, పాదాలవారిపాలెం, వి.కొత్తపాలెం, జయపురం, ఉల్లిపాలెం, హంసలదీవి, పిట్టల్లంక, మాచవరం, విశ్వనాథపల్లి గ్రామాల్లో ఆంజనేయస్వామివారి ఆలయాల వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గారె, అప్పాలు, వడమాలలతో అలంకరించారు. ఆలయాల వద్ద 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు.

**శోభాయాత్రకు విశేష స్పందన..**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రకు విశేష స్పందన లభించింది. హిందూ ధర్మ భజన సేవా సంఘం, భాష్యకార భక్త సమాజం, తిరుమల భజన బృందాల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. కోడూరు తూర్పు వైపు నుంచి వంతెన సెంటర్‌లోని కల్యాణ వెంకన్న ఆలయం వరకు భక్తులంతా కాలినడక యాత్ర నిర్వహించారు.

**ఘంటసాలలో...**

ఘంటసాల: మండలంలో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఘంటసాల గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు బాలగోపాల వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్‌ల అర్చకత్వంలో శ్రీఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 1800 మందికి అన్నసమారాధన కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తాళం భజన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కొండపల్లి పిచ్చేశ్వరరావు, కొల్లూరి శ్రీనివాసరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, వేమూరి సుబ్రహ్మణ్యం కార్యక్రమాలను పర్యవేక్షించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఘంటసాల మండలంలోని దేవరకోట, శ్రీకాకుళం, కొడాలి, తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**బంటుమిల్లిలో...**

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో రామాలయాలు, ఆంజనేయస్వామి మందిరాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆర్తమూరు, ముంజులూరు, చోరంపూడి, బంటుమిల్లి తదితర గ్రామాల్లో వైష్ణవాలయాల్లోను, రామమందిరాల్లోను ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. చోరంపూడి గ్రామంలోని ఆంజనేయ స్వామి మందిరంలో ఐదురోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామపెద్దలు ఏర్పాటు చేశారు. పాశ్వాపురం శ్రీసువర్చలాంజనేయ స్వామి ఆలయంలో జయంతి ఉత్సవాల్లో భాగంగా హనుమాన్ చాలీసా పారాయణం ముగింపు సందర్భంగా 46వ రోజు 108 సార్లు పారాయణం చేశారు. కామరాజు దంపతుల సౌజన్యంతో దాదాపు 3వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

## భక్తిశ్రద్ధలతో హనుమత్ జయంతి

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద హనుమత్ జయంతి వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. రాజుపేట లోని ప్రముఖ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం, పరాసుపేట, ఈడేపల్లి, బచ్చుపేటలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయాల్లో హనుమత్ జయంతి పర్వదినం సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల ప్రధాన అర్చకులు వడమాలలు, గారెల మాల, నిమ్మకాయల మాలలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. పలు ఆలయాల వద్ద నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాల్లో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయాల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆయా ఆలయ కమిటీలు ఏర్పాట్లు పర్యవేక్షించాయి.



ఈడేపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు

## పరిహారం పంపిణీపై కొనసాగుతున్న విచారణ

పెడన: మండలంలోని మిచాంగ్ పంట నష్టపరిహారం పంపిణీ విషయంలో వ్యవసాయశాఖలో జరిగిన అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టిన విషయం విదితమే. మే 29న ప్రారంభించిన ఈ విచారణ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. మండల పరిధిలోని శింగరాయపాలెం గ్రామంలో చోటు చేసుకున్న మిచాంగ్ పంట నష్టపరిహారం పంపిణీలో అవకతవకలపై జిల్లా వ్యవసాయశాఖ అదనపు సహాయ సంచాలకులు(డీడీఏవో) ఎస్‌వైవీఎస్ మనోహరరావు విచారణ నిర్వహించారు. నాలుగో రోజు శనివారం కూడా ఆయన పెడన ఏవో కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఏడీఏ మణిధర్ కూడా పాల్గొన్నారు. రైతుల నుంచి ఏం జరిగిందనే దానిపై లిఖితపూర్వకంగా రాయించి తీసుకున్నారు. ఆయా గ్రామాలకు చెందిన పంట నష్టపరిహారం పంపిణీ రైతుల జాబితాలలో ఎవరు అర్హులు, అనర్హులు ఎవరెవరున్నారు, ఎంత మంది ఉన్నారనే దానిపై వివరాలను అడిగి తీసుకున్నట్లు రైతులు వెల్లడించారు. పెడన పట్టణానికి చెందిన వారి పేర్లు చాలా ఉన్నాయని, అవి కాకుండా శింగరాయపాలెం, కట్లపల్లి గ్రామాలకు చెందిన జాబితాలలో కూడా అనర్హులున్నారని రైతులు పేర్కొంటున్నారు. రైతుల పేరుంటే వారి బ్యాంకు ఖాతాలు మార్చారని, కొందరు రైతులకు సంబంధించిన సర్వే నంబర్లు రైతులు కాని వారికి చూపించి నగదు జమ అయ్యేలా చూడటమే కాకుండా ఆ నగదు తిరిగి స్వాహా చేశారని, ఎవరు ఈ విధంగా చేశారనే విషయాలను ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశామని రైతులు తెలిపారు. వీఆర్వో, ఇన్‌చార్జి వీఏఏల నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్‌లు తీసుకున్నట్లు సమాచారం. మండలంలో ఇంకా ఎక్కడైనా జరిగి ఉండవచ్చుననే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా మనోహరరావు మాట్లాడుతూ విచారణ పూర్తి స్థాయిలో చేస్తున్నామన్నారు. మరో పక్క ఎన్నికల హడావుడి, లెక్కింపు ప్రక్రియ ఉండటం వల్ల జాప్యం ఏర్పడుతుందని, మరో వారం రోజుల లోపు విచారణ కొలిక్కి వస్తుందన్నారు.



ఏవో కార్యాలయంలో వివరాలను తెలుసుకుంటున్న డీడీఏవో మనోహరరావు, ఏడీఏ మణిధర్

## మోపిదేవి ఆలయంలో లైసెన్సు హక్కుకు వేలం

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో వివిధ కేటగిరిల్లో షాపుల లైసెన్సు పొందేందుకు శనివారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు మాట్లాడుతూ దేవస్థానంలో పలు షాపుల నిర్వహణకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలు నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 1, 2024 నుంచి మే 31, 2026 సంవత్సరం రెండు సంవత్సరాలకు గాను అత్యధికంగా వేలం పాట పాడినవారి వివరాలు తెలియజేశారు. దేవస్థానంకు చెందిన వాహన పార్కింగ్ నందు ప్రకటన బోర్డు ఏర్పాటు చేసుకొను హక్కు గాను సీల్డ్ టెండర్ ద్వారా మోపిదేవికి చెందిన ఆర్.ఆదిలక్ష్మి రూ.26 వేలకు హెచ్చు పాటకు లైసెన్సు పొందియున్నారు. సంచార ఫొటోలు తీసుకును లైసెన్సు సీల్డ్ టెండర్ ద్వారా శివరామపురానికి చెందిన బీడీఆర్ ప్రసాద్ రూ.1 లక్ష 62 వేలకు లైసెన్సు పొందారు. మిగిలిన పాటలకు ఔత్సాహికులు ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామని, వాటికి తిరిగి ఎప్పుడు వేలం పాటలు నిర్వహించేది తరువాత తెలియజేస్తామని ఏసీ చక్రధరరావు తెలిపారు.



మోపిదేవి దేవస్థానంలో వేలం పాటల వివరాలు ప్రకటిస్తున్న ఆలయ ఏసీ చక్రధరరావు

### 87.02 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం ఉదయం ప్రారంభించారు. శనివారం సాయంత్రానికి పింఛన్ల పంపిణీని 87.02 శాతం మేర పూర్తి చేశారు. నగరంలో 5,487 మంది లబ్ధిదారులకు ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 4,775 మందికి పింఛన్లు అందజేశారు. నగరంలో పింఛన్ల పంపిణీ 87.02 శాతం పూర్తయింది.

### జపమాల మాత ఊరేగింపు

అవనిగడ్డ: స్థానిక కోటగిరిలంకలోని తిరుకుటుంబ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి) విచారణ గురువు సురేష్ మెర్లో ఆధ్వర్యంలో జపమాల మాత (మరియతల్లి) ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మరియమాత స్వరూపాన్ని ఎత్తుకుని ఫాదర్ సురేష్ మెర్లో, ఫాదర్ క్రీస్తురాజు గొరుముచ్చు ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం తిరుకుటుంబ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## ముస్లింల సమష్టి కృషి ఆదర్శనీయం



చల్లపల్లి: చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీ ముస్లింల సమష్టి కృషి ఆదర్శనీయమని స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ - డాక్టర్ తరిగోపుల పద్మావతి అన్నారు. స్థానిక నారాయణరావు నగర్‌లోని ముస్లిం ఖబరస్థాన్ స్థలాన్ని శనివారం డీఆర్‌కే దంపతులు పరిశీలించారు. ఖబరస్థాన్ అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని చేసిన విజ్ఞప్తి మేరకు డీఆర్‌కే దంపతులు ఆ స్థలాన్ని పరిశీలించి అభివృద్ధి పనులపై చర్చించారు. ఖబరస్థాన్‌కు అవసరమైన మౌలిక సౌకర్యాల గురించి చర్చించారు. భారీ గోతులు, ముళ్ల పొదలతో ఉన్న ఖబరస్థాన్ స్థలం వినియోగంలోకి తేవాలనే సంకల్పంతో కాలనీ ముస్లింలు శ్రమదానం చేసి స్థలాన్ని అభివృద్ధి చేసుకున్న తీరును అభినందించారు. ఖబరస్థాన్ ప్రధాన గేటు, జనాజా నమాజ్ షెడ్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. వారి ఔదార్యానికి ముస్లింలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గౌసియా మస్జీదు అధ్యక్షుడు ఎస్ఎంఏ షరీఫ్, కార్యదర్శి సయ్యద్ మీర్, ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, బాజీ, ఖాజావలీ, కరిముల్లా, అబ్దుల్ రహీం, హుసేన్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన భోజనం అందించాలి

పెడన: ప్రభుత్వ బడులకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని అందించేలా కుకింగ్ ఏజెన్సీలు కృషి చేయాలని మధ్యాహ్న భోజన పథకం కృష్ణా జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ వి.మనోహర్ నాయక్ అన్నారు. పట్టణంలోని బంగ్లాస్కూలు(ఎంపీపీఎస్)లో శనివారం మండలంలోని మధ్యాహ్న భోజన కుకింగ్ ఏజెన్సీలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఏడీ ఏజెన్సీలను ఉద్దేశించి పలు సూచనలు జారీ చేశారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసేందుకు ఆసక్తి చూపించేలా రుచికరంగా పరిశుభ్రంగా నాణ్యమైన వంటలు చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక మెనూ రూపొందించారని, కుకింగ్ ఏజెన్సీలు దాని కనుగుణంగా వంటలు చేయాలన్నారు. ఇందులో భాగంగా తిరుపతి తాజ్ హోటల్ చెఫ్‌లు చేసిన వంటల వీడియోలు కుకింగ్ ఏజెన్సీలకు ఐఎఫ్‌పీ ప్యానెల్ ద్వారా చూపించి శిక్షణ ఇచ్చారు. ఎంఈవో-1 దుర్గా ప్రసాద్, ఎంఈవో-2 హరనాథ్ మాట్లాడారు. ప్రథమ స్థానంలో 5వ వార్డు ఉర్దూ బాలికల పాఠశాల, ద్వితీయ స్థానంలో ఉప్పలకలవగుంట ప్రాథమిక పాఠశాల, తృతీయ స్థానంలో నందిగామ జెడ్పీ ఉన్నత పాఠశాల కుకింగ్ ఏజెన్సీలు నిలిచాయన్నారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ శిక్షణకు నందమూరు హైస్కూల్ ఏజెన్సీ కట్టా రాజకుమారి మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన జిల్లా ఆపరేటర్ నరసింహ, మండల ఆపరేటర్ అబ్దుల్ రహీం, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రఫీఉల్లా, సీఆర్పీలు పాల్గొన్నారు.

### దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా, పెడన మండలం, మడక గ్రామానికి చెందిన గంజాల కోటేశ్వరమ్మ W/o. మల్లికార్జునరావు అను నాకు చెందిన 0.55 సెంట్ల వ్యవసాయభూమికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు నెంబర్ 1720/2014, రిజిష్టర్ తేది : 30/07/2014 జిరాక్స్ తీయించుకునే నిమిత్తం పెడన వెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.
సంప్రదించండి : 9866309706